దేశీయ విమానాల్లోనూ వైఫై సేవలు

దేశంలో తొలిసారి ఎయిర్ ఇండియా అమలు

న్యూఢిల్లీ: దేశీయ విమాన ప్రయాణికులకు ఎయిర్ ఇండియా శుభవార్త చెప్పింది. తమ సంస్థకు చెందిన ఎయిర్‌బస్ ఏ350, బోయింగ్ 757-9, ఎంపిక చేసిన కొన్ని ఎయిర్‌బస్‌లు, ఎ321 నియో విమానాలకు చెందిన దేశీయ, అంతర్జాతీయ సర్వీసులలో వైఫై ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్టు ఎయిర్ ఇండియా బుధవారం ప్రకటించింది. దేశీయ విమాన సర్వీసులలో వైఫై ఇంటర్నెట్ కనెక్టివిటీని అందజేయడం ఇదే మొదటిసారి. ఈ ఘనత టాటా గ్రూపునకు చెందిన ఎయిర్ ఇండియాకు దక్కింది. అంతర్జాతీయ విమానాలలో వైఫై సర్వీసులను విస్తారా గత ఏడాది జూలైలో మొట్ట మొదటిసారి ప్రవేశపెట్టింది. నవంబర్‌లో విస్తారా ఎయిర్ ఇండియాలో విలీనమైంది. భారతీయ గగనతలంలో 10,000 అడుగుల ఎత్తుకు చేరుకున్న తర్వాత విమానంలో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించడానికి అనుమతించినపుడు వైఫై ద్వారా మాత్రమే విమానంలోని ప్రయాణికులు ఇంటర్నెట్ సర్వీసులను వాడడం సాధ్యమవుతుందని టెలికం శాఖ నవంబర్‌లో ప్రకటించింది. అంతర్జాతీయ విమానాలలో వైఫై సర్వీసులను అమలు చేస్తున్న నేపథ్యంలో దేశీయ విమానాలలో కూడా వైఫై ఇంటర్నెట్ సర్వీసులను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్టు ఎయిర్ ఇండియా తెలిపింది. ఎయిర్ ఇండియా గ్రూపులో ప్రస్తుతం దాదాపు 300 విమానాలు ఉన్నాయి. వీటిలో ఎయిర్ ఇండియాతోపాటు తక్కువ చార్జీలతో నడిచే దాని అనుబంధ ఎయిర్‌లైన్ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. గత అక్టోబర్‌లో ఏఐఎక్స్ కనెక్ట్ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌లో విలీనమైంది. తర్వాత విస్తారా సైతం విలీనమైంది.

నెగెటివ్ టైమూ ఉంటుంది! క్వాంటమ్ ప్రయోగం ద్వారా ప్రదర్శించిన పరిశోధకులు

టొరంటో, జనవరి 1: 'నెగెటివ్ టైమ్' అనేది కేవలం ఒక సైద్ధాంతిక భావన కాదని, ఇది నిజమైన అంశమేనని కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ టొరంటోకు చెందిన పరిశోధకులు గుర్తించారు. వినూత్న క్వాంటమ్ ప్రయోగం ద్వారా వారు ఈ విషయాన్ని నిరూపించారు. ఒక వస్తువులోకి కాంతి ప్రవేశించడానికి ముందే దాని నుంచి ఉద్భవిస్తున్నదని ఈ ప్రయోగం ద్వారా పరిశోధకులు ప్రదర్శించారు. సమయ స్వభావంపై అనేక దశాబ్దాలుగా ఉన్న ఆలోచనలకు భిన్నమైన అంశాన్ని ఈ ప్రయోగం చూపించింది. 'ఫోటాన్లు ఉత్తేజిత స్థితిలో అణువులను ప్రతికూల సమయాన్ని గడిపేలా చేయగలవని మా ప్రయోగం నిరూపించింది' అని యూనివర్సిటీ ఆఫ్ టొరంటో పరిశోధకులు స్టీన్‌బెర్గ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

డిప్రెషన్‌లో యువకుడి 'చేతివాటం'

చెంపదెబ్బలు కొట్టి జైలు పాలు

లక్నో: తండ్రి మరణం, తల్లి ద్వితీయ వివాహంతో నైరాశ్యంలోకి జారుకున్న 23 ఏండ్ల యువకుడు అందులోనుంచి బయటపడేందుకు ఎంచుకున్న మార్గం అతడిని కటకటాలపాలు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నివసించే కపిల్ కుమార్ డిప్రెషన్ నుంచి బయటపడేందుకు అపరిచితులను చెంపదెబ్బ కొట్టి సంతృప్తి పడేవాడు. ఓ మహిళను, ఓ రిటైర్డ్ ఐపీఎస్ అధికారితో సహా పలువురిని చెంపదెబ్బ కొట్టినందుకు అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత ఐదారు నెలలుగా ఓ వ్యక్తి అపరిచితులను చెంపదెబ్బ కొడుతున్నట్టు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనల నుంచి బయటపడేందుకే తాను స్కూటర్‌పై వెళుతూ అపరిచిత వ్యక్తులను చెంపదెబ్బ కొడుతున్నట్టు కపిల్ కుమార్ చెప్పినట్టు మీరట్(సిటీ) ఎస్పీ ఆయుష్ విక్రమ్ సింగ్ తెలిపారు. కపిల్ చేష్టలకు సంబంధించిన అనేక వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడం, ఫిర్యాదులు రావడంతో పోలీసులు రంగంలోకి దిగినట్టు ఆయన చెప్పారు. కపిల్ చేతిలో చెంపదెబ్బ తిన్న ఓ మహిళ స్థానిక రాజకీయ నాయకుడి బంధువు కావడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. కపిల్ తండ్రి ఐదేళ్ల క్రితం మరణించాడు. తల్లి మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. ప్రస్తుతం కపిల్ సూరజ్‌కుండ్‌లో తన తల్లి, మారు తండ్రి వద్ద ఉంటున్నట్టు పోలీసులు చెప్పారు. తనకు ఉద్యోగం లేదని, తాను చిన్నప్పటి నుంచి ఎన్ని మంచి పనులు చేసినా తనకు మంచి జరగడం లేదని అతను పోలీసులకు చెప్పాడు. చెడ్డ పనులు చేస్తే తనకు మంచి జరుగుతుందన్న ఉద్దేశంతోనే అపరిచిత వ్యక్తులను చెంపదెబ్బలు కొడుతున్నట్టు కపిల్ చెప్పాడని ఎస్పీ తెలిపారు.

వాట్సాప్‌తో జరభద్రం

- సైబర్ నేరగాళ్లకు అస్త్రంగా మెసేజింగ్ యాప్
- తర్వాతి స్థానాల్లో టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్
- వెల్లడించిన కేంద్ర హోంశాఖ నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 1: సైబర్ నేరాలకు వాట్సాప్ ప్రధాన అస్త్రంగా మారుతున్నదని కేంద్రం హోంశాఖ తాజా నివేదిక స్పష్టం చేస్తున్నది. సైబర్ మోసాలపై అందుతున్న ఫిర్యాదుల్లో వాట్సాప్ ద్వారా జరిగిన మోసాలపైనే ఎక్కువగా ఉంటున్నాయని ఈ నివేదిక పేర్కొన్నది. గత ఏడాదికి సంబంధించిన కేంద్ర హోంశాఖ వార్షిక నివేదికలో సైబర్ మోసాలపై కీలక విషయాలు వెల్లడయ్యాయి. సైబర్ నేరగాళ్లు గూగుల్ యాడ్స్ వంటి గూగుల్ సేవలను ఉపయోగించుకొని ఆన్‌లైన్ మోసాలకు పాల్పడటం పెరుగుతున్నదని ఈ నివేదిక పేర్కొన్నది. విదేశాల నుంచి కూడా గూగుల్ యాడ్స్ ద్వారా లక్షిత ప్రకటనలు ఇస్తూ మోసాలు చేస్తున్నారు. నిరుద్యోగులు, గృహిణులు, విద్యార్థులే లక్ష్యంగా 'పెట్టుబడి మోసాలు' కూడా పెరిగాయి. భారీ లాభాలు వస్తాయనే ఆశ చూపించి బాధితులను సైబర్ నేరగాళ్లు ముంచేస్తున్నారు. సైబర్ నేరగాళ్ల బృందాలు దేశంలో ఫేస్‌బుక్ ప్రకటనల ద్వారా అక్రమ రుణ యాప్‌లను ప్రమోట్ చేయడం కూడా పెరిగింది.

చైనాలో సోలార్ గ్రేట్ వాల్

- ఎడారిలో డ్రాగన్ భారీ సౌర విద్యుత్తు ప్రాజెక్టు
- 100 గిగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో
- 400 కిలోమీటర్ల పొడవైన సోలార్ ప్యానెళ్లు

బీజింగ్: సౌర విద్యుదుత్పత్తి రంగంలో చైనా మరో అద్భుతాన్ని సృష్టించబోతున్నది. 400 కిలోమీటర్ల పొడవుతో భారీ సౌర విద్యుత్తు ఫలకాలను ఏర్పాటు చేస్తున్నది. ఇన్నర్ మంగోలియాలో 'సీ ఆఫ్ డెత్'గా ప్రాచుర్యం పొందిన కుబుకి ఎడారిలో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టును 'సోలార్ గ్రేట్ వాల్' అని పిలుస్తున్నారు. 100 గిగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే సామర్థ్యంతో ఐదు కిలోమీటర్ల వెడల్పు, 400 కిలోమీటర్ల పొడవున ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతున్నది. ఇప్పటికే 5.4 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి సరిపడా సౌర ఫలకాలను ఏర్పాటు చేసినట్టు అధికారులు తెలిపారు. రాజధాని బీజింగ్‌కు విద్యుత్తును అందించాలనే లక్ష్యంతో చైనా ఈ భారీ ప్రాజెక్టును చేపట్టింది. 2030 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కానున్నది. నాసాకు చెందిన ఓఎల్ఐ, ఓఎల్ఐ-2 ఉపగ్రహాలు అంతరిక్షం నుంచి తీసిన చిత్రాల్లో ఈ కొత్త సౌర విద్యుత్తు ప్రాజెక్టు స్పష్టంగా కనిపిస్తున్నది.

ఎండల్లో 2024 రికార్డు

1901 తర్వాత భారత్‌లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు

న్యూఢిల్లీ, జనవరి 1: అధిక ఉష్ణోగ్రతల్లో 2024 సంవత్సరం కొత్త రికార్డును సృష్టించింది. 1901 తర్వాత అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైంది గత ఏడాదేనని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. భారత్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రతల్లో 1991 - 2020 మధ్య దీర్ఘకాల సగటు కంటే 2024లో 0.90 డిగ్రీల ఉష్ణోగ్రత ఎక్కువగా నమోదయ్యిందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. గత ఏడాది వాతావరణ పరిస్థితులపై బుధవారం ఆయన వర్చువల్ ప్రెస్ మీట్ నిర్వహించారు. భారత్‌లో భూ ఉపరితల వార్షిక వాయు ఉష్ణోగ్రత సైతం దీర్ఘకాల సగటు కంటే 0.65 డిగ్రీలు ఎక్కువగా నమోదైనట్టు చెప్పారు. ఇంతకుముందు అత్యధికంగా 2016లో 0.54 డిగ్రీలు నమోదయ్యిందని గుర్తు చేశారు.

జేఈఈ మెయిన్ సెషన్ 1 పరీక్ష షెడ్యూల్ విడుదల

22 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు

న్యూఢిల్లీ, జనవరి 1: జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(మెయిన్)-2025 సెషన్ 1 పరీక్షల షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) బుధవారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా వేర్వేరు నగరాలతో పాటు భారత్ బయట 15 నగరాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. జనవరి 22 నుంచి పరీక్షలు మొదలవుతాయి. పేపర్ 1(బీఈ/బీటెక్) పరీక్ష జనవరి 22, 23, 24, 28, 29 తేదీల్లో రెండు షిఫ్టుల్లో జరుగుతుంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి షిఫ్టు, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండో షిఫ్టులో పరీక్ష నిర్వహిస్తారు. పేపర్ 2ఏ(బీఆర్క్), పేపర్ 2బీ(బీ ప్లానింగ్), పేపర్ 2ఏ, 2బీ(బీఆర్క్, బీ ప్లానింగ్ రెండింటికి) పరీక్ష జనవరి 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు జరగనుంది.

2 పంట బీమా పథకాల అమలు మరో ఏడాది పొడిగింపు

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 1: రెండు పంట బీమా పథకాల గడువును కేంద్రం మరో ఏడాది పొడిగించింది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), పునర్వ్యవస్థీకృత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం(ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్)ను 2025-26 సంవత్సరానికి పొడిగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. టెక్నాలజీకి ఊతం ఇచ్చేందుకు రూ. 824.77 కోట్లతో నిధిని ఏర్పాటు చేయాలని కూడా కేంద్రం నిర్ణయించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన క్యాబినెట్ కమిటీ(సీసీఈఏ) సమావేశమై ఈ మేరకు నిర్ణయాలు తీసుకుంది. పీఎంఎఫ్‌బీవై, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్‌కు బడ్జెట్ కేటాయింపులను పెంచినట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం విలేకరులకు తెలిపారు.

యూఐడీఏఐ సీఈఓగా భువనేశ్ కుమార్

న్యూఢిల్లీ: భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా భువనేశ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అదనపు కార్యదర్శిగా కొనసాగుతారు. ప్రస్తుత యూఐడీఏఐ సీఈఓ అమిత్ అగర్వాల్ ఫార్మా కార్యదర్శిగా నియమితులయ్యారు. భువనేశ్ 1995 బ్యాచ్ ఉత్తరప్రదేశ్ కాడర్ ఐఏఎస్ అధికారి. కురుక్షేత్రలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గ్రాడ్యుయేట్, బంగారు పతక విజేత కూడా. ఆయన కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో పలు కీలక పదవులను నిర్వహించారు.

రూ.14.5 తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

న్యూఢిల్లీ, జనవరి 1: దేశంలో వాణిజ్య సిలిండర్ ధరలు స్వల్పంగా తగ్గాయి. హోటల్స్, రెస్టారెంట్లలో వాడే 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధరను రూ.14.5 తగ్గించారు. అలాగే విమాన ఇంధన ధర దేశ రాజధానిలో కిలో లీటర్‌కు రూ. 1,401.37 తగ్గి రూ.90, 455.47కు చేరుకుంది. కాగా, వరుసగా రెండు నెలలుగా పెరుగుతూ వస్తున్న ఏటీఎఫ్ ధర మూడో నెలలో 1.5 శాతం తగ్గింది. కాగా, గృహవినియోగ వంటగ్యాస్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు.

అమెరికాలో ట్రక్కు బీభత్సం

- న్యూఓర్లీన్స్‌లో జనంపైకి దూసుకెళ్లిన వాహనం
- 10 మంది మృతి.. 35 మందికి గాయాలు
- ట్రక్కు దిగి ప్రజలపై కాల్పులు జరిపిన డ్రైవర్

బుధవారం న్యూఓర్లీన్స్ నగరంలో జనంపైకి దూసుకెళ్లిన ట్రక్కు

న్యూ ఓర్లీన్స్: నూతన సంవత్సరం వేడుకల వేళ అమెరికాలోని న్యూఓర్లీన్స్ నగరంలో విషాదం చోటుచేసుకుంది. విలాస వేడుకలకు పేరుపొందిన బార్బన్ స్ట్రీట్, ఐబర్‌విల్లే మధ్య వీధిలో బుధవారం తెల్లవారుజామున 3.15 గంటల ప్రాంతంలో జన మూహంపైకి వేగంగా ఓ ట్రక్కు దూసుకువచ్చింది. జనం భీతావహులై పరుగుత్తుతుండగా ట్రక్కు నుంచి దిగిన డ్రైవర్ జనంపైకి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 10 మంది మరణించగా, 35 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనను ఉగ్రవాద చర్యగా పరిగణిస్తూ ఎఫ్‌బీఐ దర్యాప్తు చేపట్టింది. పోలీసులు జరిపిన ఎదురుకాల్పులలో ట్రక్కు డ్రైవర్ మరణించాడు. పేలుడు పదార్థాలు ఏవైనా దాచి ఉంచారా అన్న అనుమానంతో పోలీసులు ఆ ప్రాంతంలో సోదాలు జరుపుతున్నారు. ఘటనా స్థలంలో ఒక ఐఈడీగా అనుమానిస్తున్న వస్తువు లభించినట్టు ఎఫ్‌బీఐ అధికారి ఒకరు తెలిపారు. కాగా.. ట్రక్కు డ్రైవర్ సాగించిన హత్యాకాండను ఉగ్రవాద చర్యగా న్యూ ఓర్లీన్స్ మేయర్ లాటోవా కాంట్రెల్ అభివర్ణించారు. ఇది ఉద్దేశపూర్వకంగా చేసిన హత్యలని నగర పోలీసుకమిషనర్ అన్నే కిర్క్‌పాట్రిక్ తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే మారణకాండ సృష్టించడానికి ట్రక్కు డ్రైవర్ ప్రయత్నించాడని ఆయన చెప్పారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసు అధికారులు గాయపడ్డారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆయన చెప్పారు. కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకునేందుకు వేలాది మంది బార్బన్ వీధిలో ఉన్నట్టు తెలుస్తోంది. పోలీసులు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించడంతో అక్కడకు ఎవరూ ఆ ప్రాంతానికి వెళ్లవద్దని ప్రజలను పోలీసులు కోరారు. ఘటనలో గాయపడిన వారిని దవాఖానలకు తరలించి చికిత్స అందచేస్తున్నారు.

ఆస్ట్రేలియా పేరెంట్ వీసాకు 31 ఏండ్ల నిరీక్షణ

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా పేరెంట్ వీసాలకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్నది. దీనితో పాటు దాని నిరీక్షణ సమయం కూడా అనూహ్యంగా పెరిగిపోయింది. ఆస్ట్రేలియా జనరల్ పేరెంట్ వీసా కోసం 31 ఏండ్లు, కాంట్రిబ్యూటరీ పేరెంట్ వీసా కోసం 14 ఏండ్లు నిరీక్షించాల్సి ఉందని తాజా నివేదిక తెలియజేసింది. దీంతో ఈ వీసా కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో గత మూడేండ్లలో 2300 మంది మరణించినట్టు ఆస్ట్రేలియా హోం శాఖ తెలిపింది. ఆస్ట్రేలియా పేరెంట్ వీసాలకు డిమాండ్ బాగా పెరగడంతో దీని సంఖ్యను ఏడాదికి 4500 నుంచి 8500కు పెంచారు. అయితే ఇవి ఏ మూలకూ సరిపోవడం లేదు. వీటి కోసం వచ్చే దరఖాస్తులు మాత్రం అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. 2023లో వీటి దరఖాస్తులు 1.5 లక్షలకు చేరుకున్నట్టు అధికారులు తెలిపారు.

మాకు విదేశీ నిపుణులు అక్కర్లేదు!

హెచ్1బీ వీసాపై అమెరికన్ల మనోగతం

వాషింగ్టన్, జనవరి 1: అగ్రరాజ్యం అమెరికాలో హెచ్-1బీ వీసాలపై అటు రాజకీయ నేతల్లో, ఇటు పౌర వర్గాల్లో జోరుగా చర్చ సాగుతున్నది. వాస్తవానికి హెచ్-1బీ వీసా ద్వారా విదేశీయులను రప్పించాల్సిన స్థితిలో అమెరికా లేదని ఆ దేశానికి చెందిన మెజార్టీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తక్కువ స్థాయిలో నైపుణ్యం గల గ్రాడ్యుయేట్లను అమెరికా తయారు చేస్తున్నదన్న వాదనను వారు కొట్టిపారేస్తున్నారు. రాస్ముసేన్ అనే సంస్థ తాజా నివేదిక ప్రకారం వైట్ కాలర్ ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వడానికి, నియమించడానికి నిపుణులైన ఉద్యోగులు, కార్మికులు ఇప్పటికే దేశంలో తగినంత మంది ఉన్నారని, కొత్తగా నిపుణులైన విదేశీయులను రప్పించాల్సిన అవసరం లేదని మెజార్టీ అమెరికన్లు స్పష్టం చేస్తున్నారు. ఇటీవల జరిపిన ఈ సర్వేలో అధిక శాతం హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని విస్తృతం చేయాల్సిన అవసరం లేదని తేగేసి చెప్పారు. ఇప్పటికే అమెరికా కావల్సినంత మంది నిపుణులను కలిగి ఉందని 60 శాతం పౌరులు అభిప్రాయపడ్డారు. కొత్తగా విదేశాల నుంచి రప్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ దృక్పథం రిపబ్లికన్లలో బలంగా ఉంది. 65 శాతం స్వింగ్ ఓటర్లు, 47 శాతం డెమోక్రాట్లు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, 26 శాతం మాత్రమే కొత్త నైపుణ్యాన్ని తీసుకురావాలని పేర్కొన్నారు.

నిపుణులను రప్పించాల్సిందే

అమెరికాలో ప్రధాన కంపెనీలైన అమెజాన్, గూగుల్, టెస్లాల్లో ప్రధాన ఉద్యోగాల్లో నియామకానికి ఈ హెచ్-1బీపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. స్థానికంగా తమకు సరిపడా నిపుణులైన సిబ్బంది లభ్యం కావడం లేదని, తమ సంస్థలు పూర్తి స్థాయిలో పనిచేయాలంటే విదేశాల నుంచి రప్పించే వారిపైనే ఆధారపడక తప్పదని, కార్మిక అంతరాలను ఈ విధానం పూరిస్తుందని ఇవి పేర్కొంటున్నాయి. అయితే వీరి కారణంగా స్థానికులైన అమెరికన్లు వేతన అణచివేతకు గురవుతున్నారని, చవకగా వచ్చే నిపుణుల కారణంగా వారి ఉపాధి అవకాశాలు దెబ్బతినడమే కాక, శ్రమదోపిడీకి గురవుతున్నారని మరికొందరు వాదిస్తున్నారు.

ట్రంప్ పార్టీలోనే భేదాభిప్రాయాలు

అమెరికాలోని కంపెనీలలో పనిచేయడానికి నిపుణులైన విదేశీ కార్మికులు, ఉద్యోగులను కంపెనీలు రప్పించుకునేందుకు హెచ్-1బీ వీసాలను ప్రభుత్వం జారీ చేస్తుంది. దీని కారణంగా భారత్, చైనా లాంటి దేశాల్లోని నిపుణులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయి. ఇటీవల అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ గెలవడంతో ఈ వీసాల సంఖ్య తగ్గిస్తారని తొలుత ప్రచారం జరిగినా తన ముఖ్య సలహాదారులు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (డీఓజీఈ) సంయుక్త సారథులుగా నియమితులైన ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి లాంటి వారు ఈ వీసా విధానానికి మద్దతు ఇచ్చారు. టాలెంట్ ఎక్కడున్నా ప్రోత్సహించాలన్నది వారి వాదన. తర్వాత ట్రంప్ సైతం వారికి మద్దతుగా గళం కలిపారు. తాను ఎల్లప్పుడూ ఈ వీసా విధానానికి అనుకూలమేనని ప్రకటించారు. దీంతో ట్రంప్ పార్టీలోనే దీనిపై భేదాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఠాక్రే సమక్షంలో రౌత్‌పై కార్యకర్తల దాడి!

ముంబై, జనవరి 1(నమస్తే తెలంగాణ): శివసేన ఎంపీ సంజయ్ రౌత్‌పై సొంత పార్టీ కార్యకర్తలే దాడి చేసినట్టు సమాచారం. పార్టీ చీఫ్, మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే నివాసంలోనే ఆయనపై కార్యకర్తలు దాడి చేసినట్టు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. బుధవారం ముంబైలోని బాంద్రాలో ఉన్న మాతోశ్రీలో ఉద్ధవ్ ఠాక్రేతో సంజయ్ రౌత్ సమావేశమయ్యారు. ఈ సమావేశం సందర్భంగా కొంత మంది పార్టీ కార్యకర్తలు సంజయ్‌తో వాగ్వాదానికి దిగారు. ఆయన వ్యాఖ్యల వల్లే పార్టీ తీవ్రంగా నష్టపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో, వాగ్వాదం చోటుచేసుకోగా, సంజయ్‌రౌత్‌పై ఠాక్రే మద్దతుదారులు దాడి చేసి కొట్టారు. అనంతరం అతడిని కొన్ని గంటల పాటు ఓ గదిలో నిర్బంధించి తాళం వేశారు. ఇదంతా ఠాక్రే సమక్షంలోనే జరిగినట్టు తెలిసింది. అయితే దీనిపై ఠాక్రే కానీ, సంజయ్ రౌత్ గానీ స్పందించ లేదు. కాగా, మహారాష్ట్రలో జరగబోయే బీఎంసీ ఎన్నికలపై ఉద్ధవ్ ఠాక్రే కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బీఎంసీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు పార్టీ నేత ఆనంద్ దూబే చెప్పుకొచ్చారు.

స్కిన్ క్యాన్సర్ చికిత్సకు క్రీమ్

- తయారు చేసిన ఆస్ట్రేలియా పరిశోధకులు
- సర్జరీ, రేడియోథెరపీకి ప్రత్యామ్నాయం



సిడ్నీ: చర్మ క్యాన్సర్ నివారణ, చికిత్సకు ఆస్ట్రేలియాకు చెందిన పరిశోధకులు సరికొత్త విధానాన్ని అభివృద్ధి చేశారు. సర్జరీ, రేడియోథెరపీ వంటి చికిత్సలకు ప్రత్యామ్నాయంగా ఉపయోగించేందుకు ఒక క్రీమ్‌ను తయారుచేశారు. ముఖ్యంగా అవయవ మార్పిడి ద్వారా అవయవాలు పొందిన వారిలో చర్మ క్యాన్సర్ నివారణకు ఈ క్రీమ్ సమర్థంగా పని చేస్తున్నట్లు గుర్తించారు. యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్‌లోని ఫ్రేజెర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన పరిశోధకుల బృందం ఈ క్రీమ్‌ను తయారుచేసింది. క్యాన్సర్ నివారణకు ప్రపంచంలోనే ఒక క్రీమ్ తయారుచేయడం ఇదే మొదటిసారి. ఈ క్రీమ్‌తో త్వరలోనే మనుషులపై ప్రయోగాలు జరపనున్నారు. అవయవ మార్పిడి ద్వారా అవయవాలు పొందిన వ్యక్తులకు రోగనిరోధకతను తగ్గించే ఔషధాలు ఇవ్వాల్సి వస్తుంది. అవయవాల మార్పిడి కోసం ఈ ఔషధాలు అవసరమే అయినప్పటికీ వీటి వల్ల క్వామస్ సెల్ కార్సినోమస్(ఎన్‌సీసీ), కపోసీ సార్కోమా వంటి చర్మ క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది. ఈ క్యాన్సర్ల నివారణతో పాటు వ్యాధి ప్రారంభ దశలో చికిత్సకు సైతం తాము తయారుచేసిన క్రీమ్ ఉపయోగపడుతుందని పరిశోధకుడు జేమ్స్ వెల్స్ తెలిపారు. భవిష్యత్తులో ఇది సర్జరీ, రేడియోథెరపీకి ప్రత్యామ్నాయంగా మారొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏకరూపంలోకి మనుషులు

- నలుపు-తెలుపు, పొట్టి-పొడవు తేడా ఉండదు
- మరో 50 వేల ఏండ్లలో సాధ్యం కావొచ్చు
- అంచనా వేస్తున్న జన్యు శాస్త్రవేత్తలు

న్యూయార్క్, జనవరి 1: భవిష్యత్తులో మనుషులు ఇప్పుడున్నట్టు కనిపించరా? మనుషుల మధ్య రంగు, ఆకారంలో తేడాలు మాయమవుతాయా? అంటే అవుననే అభిప్రాయపడుతున్నారు జన్యు శాస్త్రవేత్తలు. మనుషుల్లో జన్యుపరమైన పరివర్తన రావడానికి 50 వేల ఏండ్లు సరిపోతాయని అంచనా వేస్తున్నారు. 30 ఏండ్లకు ఒక తరంగా లెక్కిస్తే 50 వేల ఏండ్లలో 1,667 తరాలు మారతాయని, ఈ కాలంలో మనుషుల్లో శారీరకంగా చాలామార్పు సంభవించవచ్చని యూకేలోని ఆంగ్లియా రస్కిన్ యూనివర్సిటీ జెనెటిసిస్ట్ జేసన్ హోడ్జ్‌సన్ తెలిపారు. రానున్న కాలంలో ప్రపంచ జనాభా మధ్య సారూప్యత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఒక ప్రాంతం వారు ఆ ప్రాంతానికి చెందిన వారితోనే పిల్లలను కంటుండటం వల్ల ప్రాంతాలను బట్టి మనుషుల రంగు, ఆకారంలో మార్పులు కనిపిస్తున్నాయని చెప్పారు. మనుషుల వలసలు పెరిగిపోవడం, భాగస్వామి ఎంపికలో వైవిధ్యత వల్ల మరో 50 వేల ఏండ్ల తర్వాత మనుషుల్లో ఏకరూపత కనిపించవచ్చని, రంగు, ఆకారంలో తేడా పెద్దగా ఉండదని అంచనా వేశారు.

అనంత్ అంబానీ చేతికి 22 కోట్ల వాచ్

ముంబై: రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీ చేతి గడియారం వార్తల్లోకెక్కింది. ఇటీవల తన భార్య రాధికతో కలిసి అనంత్ అంబానీ బయటకు వెళ్లినప్పుడు ఆయన చేతి గడియారం అందరి దృష్టిని ఆకర్షించింది. నీలం రంగు డయల్‌తో ఉన్న ఈ గడియారం గురించి ఔత్సాహికులు ఇంటర్నెట్‌లో వెతకగా దిమ్మతిరిగిపోయే విషయాలు కనిపించాయి. రిచర్డ్ మిల్లే బ్రాండ్‌కు చెందిన ఈ వాచ్ ధర అక్షరాలా రూ.22 కోట్లు ఉన్నట్టు గుర్తించారు. ఈ మాడల్ వాచ్‌లను రిచర్డ్ మిల్లే కంపెనీ ఇప్పటివరకు మూడు మాత్రమే తయారుచేయగా, అందులో ఒకటి అనంత్ అంబానీ చేతికి చేరింది. అనంత్ అంబానీ వాచ్‌ల కలెక్షన్‌లో ఇలాంటి ఖరీదైనవి చాలానే ఉన్నాయి.

ఈయూకు నిలిచిన రష్యా గ్యాస్

ఉక్రెయిన్ గుండా సరఫరా ఒప్పందం గడువు ముగింపు

న్యూఢిల్లీ: యూరోపియన్ యూనియన్ (ఈయూ)కు ఉక్రెయిన్ గుండా 40 ఏళ్ల నుంచి సరఫరా అవుతున్న గ్యాస్ బుధవారం నుంచి నిలిచిపోతున్నది. ఉక్రెయిన్‌లోని నఫ్టోగాజ్, రష్యాలోని గాజ్‌ప్రోమ్ మధ్య ఒప్పందం ముగియడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ ఒప్పందం 2020లో అమల్లోకి వచ్చింది. మొదట్లో ఈయూక